ప్రజాశక్తి

గురువారం 16 మే 2024 5 అనంతపురం

## గ్రామాల్లో నిశబ్ధం..!

ఇప్పటి వరకు ఐపిఎల్ క్రికెట్‌లో పందేలు కాయడం చూశాం. అక్కడ బంతి.బంతికీ.. గెలుపోటములు ఇలా అనేక రకాలుగా పందాలు సాగుతూ ఉంటాయి. పందెం జూదరులకు ఐపిఎల్‌తోపాటు ఇప్పుడు మరో ఆట వారికి దొరికింది. సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో ఇప్పుడు ఈ ఎన్నికల ఫలితాలపై పందేలు సాగుతున్నాయి. ఈ పందేలు కూడా సాధారణం కాదు... పెద్ద మొత్తంలోనే జరుగుతున్నట్లు తెలుస్తోంది. అభ్యర్థులు గెలుపోటములపై ఒక లెక్క అయితే... వచ్చే మెజార్టీపై మరో లెక్క. అంతేకాకుండా ప్రభుత్వం ఏర్పాట్లపై మరో పందెం ఇలా రకరకాలుగా జూదం నడుస్తోంది

# కాయ్‌రాజా..కాయ్...!

## ◆ ఎన్నికల ఫలితాలపై పందేలు ◆ గెలుపు, మెజార్టీపై భారీగా బెట్టింగ్

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు పార్లమెంట్, 14 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఇందులో ఒక్కో నియోజకవర్గంపై ఒక్కో రకంగా పందేలు నడుస్తుండటం గమనార్హం. కొన్నింటిలో అభ్యర్థులు రాజకీయంగా అంత పలుకుబడి లేదనుకున్న చోట మరింత ఎక్కువగా పందేలు నడుస్తున్నాయి. మరికొన్ని ఏమో ప్రతిష్టాత్మకంగా ఉంటున్నాయి. కీలకమైన నాయకులు బరిలో ఉన్న చోట పందేలు కూడా ప్రతిష్టాత్మకంగానే మారుతున్నాయి. అనంతపురం పార్లమెంట్ పరిధిలో ఒక నియోజకవర్గంపైన గరిష్టంగా ఒకటికి 20 వంతులు కూడా పందేలు నడుస్తుండటం గమనార్హం. అంటే వారనుకున్న పార్టీ గెలిస్తే ఒకటిస్తే సరిపోతుందే.. ఓడిపోతే దానికి 20 వంతులు ఎక్కువ చెల్లించాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఒక పార్టీ గెలిస్తే లక్ష రూపాయలిస్తే సరిపోతుంది. అదే పార్టీ ఓడిపోతే పందేం కాసిన వ్యక్తి రూ.20 లక్షల అవతలి వారికి ఇవ్వాల్సి ఉంటుంది. ఈరకంగా ఒకటికి 16, ఒకటికి ఐదు కూడా నడుస్తున్నాయి. ఈ రకంగా పందేలు కాస్తున్న వారిలో ఈ ప్రాంతం వారే కాకుండా బయటి ప్రాంతాల వారూ ఉంటుండటం గమనార్హం.

**ఎవరి లెక్కలు వారివి**

ఎన్నికల ఓటింగ్ పూర్తయిన 72 గంటల వరకు పోలింగ్ శాతంపై నిర్దిష్టమైన లెక్కలొచ్చాయి. నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతం బుధవారం రోజుకుగానీ అందుబాటులోకి రాలేదు. ఓటింగ్‌పై పూర్తి స్థాయి లెక్కలు రావడంతో ఆయ పార్టీల నేతలు తమ నాయకులతో కూర్చోని ఎక్కడ ఎన్ని ఓట్లు వచ్చి ఉంటాయన్న అంచనాలు వేసుకునే పనిలోనున్నారు. పెరిగిన పోలింగ్ శాతం తమకు అనుకూలమంటే.. తమకని ఎవరికి వారు అంచనాల్లోనున్నారు. దీనికితోడు సర్వే సంస్థల పేరుతో వస్తున్న అంచనాలను చూసుకుని తమకు అనుకూలంగా ఉంటే ఆనందపడుతుండగా వ్యతిరేకంగా ఉన్నచోట గుబులు పడుతున్నారు. ఇంకా పూర్తి స్థాయి ఫలితాలు రావడానికి 18 రోజులు సమయం ఉంది. అంతవరకు ఈ అంచనాలు కూడా మారుతూనే ఉండనున్నాయి. ఈ ఎన్నికల్లో ప్రధాన పోటీ మాత్రం ఇద్దరి మధ్యనే నడిచింది. అటు వైసిపి, ఇటు టిడిపిల మధ్య ద్విముఖ పోరే నడిచింది. దీంతో గెలుపోటములు ఇద్దరి మధ్యనే ఉండనున్నాయి. ఎటువైపు ఓటరు మొగ్గుచూపారన్నది జూన్ నాలుగో తేదీన జరిగే ఓట్ల లెక్కింపు సమయంలోనే తేలే అవకాశముంది.



◆పోలింగ్ ముగియడంతో చిన్నబోయిన గ్రామాలు

◆వ్యక్తిగత పనులపై ప్రజల దృష్టి

**ప్రజాశక్తి-అనంతపురం**

ఎన్నికల రణరంగం సోమవారం జరిగిన పోలింగ్‌తో ముగిసింది. గత రెండు నెలలుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కురుక్షేత్రం కొనసాగింది. వివిధ రాజకీయ పార్టీలకు మద్దతుగా అభిమానులు, మద్దతుదారులు ప్రచారాలు నిర్వహించారు. నోటిఫికేషన్‌కు ముందు ఒక నెల నుంచి పోలింగ్ ముగిసేంత వరకు తమ అభిమాన పార్టీకి మద్దతుగా ప్రచారాలు చేశారు. ముఖ్యంగా గ్రామాల్లో ఈ రాజకీయ వేడి ఎక్కువగా కన్పించింది. పోలింగ్ ముగియడంతో గ్రామాల్లో నిశబ్ధ వాతావరణం అలముకుంది. రాజకీయ వేడి తగ్గి ఎవరి వ్యక్తిగత పనులపై వారు దృష్టి సారించే పరిస్థితులు నెలకొన్నాయి. జూన్ 4వ తేదీన జరిగే కౌంటింగ్ వరకు గ్రామాల్లో ఇదే పరిస్థితి కన్పించనుంది. కౌంటింగ్ రోజున వారి అభిమాన పార్టీ గెలిస్తే సంబరాలు చేసుకుంటారు. ఆ తర్వాత ఎన్నికలకు సంబంధించిన పూర్తి అంకం ముగియనుంది.

**ఎవరి పనులపై వారు..!**

ఎన్నికల పోలింగ్ ముగియడంతో ఆయా గ్రామాల్లో రాజకీయ పార్టీల నాయకులు, మద్దతుదారులు వారివారి వ్యక్తిగత పనులపై దృష్టి సారించనున్నారు. తమ పార్టీ అభ్యర్థి గెలవాలని ఇంత వరకు నాయకులు, కార్యకర్తలు వారి సొంత పనులను సైతం పక్కన పెట్టారు. కొందరైతే ఎన్నికల ఉన్నాయన్న నేపథ్యంలో పొలం వద్ద పంటలు కూడా పెట్టకుండా మూడు నెలలు సెలవిచ్చారు. ప్రచారాల్లో నిమగ్నం అయ్యి వారి అభ్యర్థి గెలుపునకు విస్తృత ప్రచారాలు చేశారు. వ్యవసాయం చేసుకునే రైతులు, ప్రయివేటు ఉద్యోగులు, సొంత పనులు చేసుకునే వారు, వ్యాపారులు ప్రస్తుతం వారివారి పనుల్లో నిమగ్నం అయ్యేందుకు సిద్ధం అయ్యారు.

**ఇక సొంత ఖర్చులే...**

గత రెండు నెలలుగా గ్రామాల్లో రాజకీయ వేడి ఉన్న నేపథ్యంలో ఆయా పార్టీల అభ్యర్థులు పెద్ద ఎత్తున ఖర్చు పెట్టారు. ప్రతి రోజూ భోజనం, వాహనాలకు పెట్రోల్, డీజిల్, మద్యం తదితర వాటిన్నిటికీ అభ్యర్థులే ఖర్చులు భరించే వారు. ప్రస్తుతం ఈ పరిస్థితి మారనుంది. ఇక ఎవరికి వారు సొంత ఖర్చులు భరించాల్సి వస్తోంది. ముఖ్యంగా ఇన్ని రోజుల పాటు మద్యం, బిర్యానీలకు అలవాటు పడిన వారికి పోలింగ్ ముగియడం కాస్త ఇబ్బందిగానే ఉంటోంది. ఇప్పటి నుంచి సొంతంగానే మద్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇప్పటి నుంచి ఏది తాగాలన్నా, తినాలన్న వ్యక్తిగతంగా ఖర్చు చేయాల్సిందే. ఇక ఇంత కాలం ఆయా పార్టీలు పిలిచిన ప్రచారాలు, సభలకు వెళ్లిన ప్రజలు సైతం వారివారి పనులకు వెళ్లాల్సిందే. రెండు నెలుగా ఏదో ఒక పార్టీ ప్రచారాలు, సభల పేరుతో ప్రజలను పిలిపించుకునే వారు. ఇలా పిలిపించుకున్న పార్టీల నాయకులు ఒక్కొక్కరికి రోజుకు రూ.200, రూ.500 ప్రకారం ఇచ్చారు. ఉదయం సాయంత్రం వేళల్లో ప్రచారాలకు తిరిగి డబ్బులు తెచ్చుకునే వారు. ఒకరకంగా నెల రోజులుగా పాటు ఉపాధిగా ఉన్న ఈ పనులకు ఇక ఉండవు. వారి రోజు వారి కూలి పనులకు వెళ్లాల్సిందే.

**రచ్చకట్ట రాజకీయాలు**

గ్రామాల్లో రచ్చకట్ట రాజకీయాలు జోరందుకున్నాయి. పోలింగ్ ముగియడంతో ఆ పార్టీల గ్రామ నాయకులు పోలింగ్ సరళిపై అంచనాలు వేస్తున్నారు. తమ గ్రామంలో ఎన్ని ఓట్లు ఉన్నాయి..? ఎన్ని పోలయ్యాయి.? ఎవరు ఏ పార్టీకి ఓటు వేసి ఉంటారు.? తమ అభిమాన పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయనే లెక్కలు వేస్తున్నారు. ముఖ్యంగా టిడిపి, వైసిపి నాయకులు ఈ లెక్కలు వేయడంలో బిజీగా ఉన్నారు. తమ పార్టీకే మెజార్టీ వస్తుందని ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యర్థి పార్టీలో పరిచయం ఉన్న వారితో కూడా మాట్లాడి వారి పార్టీకి గెలిచే అవకాశాలు ఏమిటన్న అంశాలపై బేరీజు వేస్తున్నారు.

## కియా అనుబంధ పరిశ్రమలో అగ్నిప్రమాదం

**ప్రజాశక్తి-సోమందేపల్లి**

శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి మండల పరిధిలోని గుడిపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో ఏర్పాటు చేసిన కియా అనుబంధ పరిశ్రమ ఎస్ఎల్ఎపి పరిశ్రమలో బుధవారం సాయంత్రం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... ఎస్ఎల్ఎపి కంపెనీలో వెల్డింగ్ పనులు చేస్తుండగా నిప్పురవ్వలు ఎగిసి పడి మంటలు వ్యాపించాయి. చూస్తుండగానే మంటలు అధికం కావడంతో అక్కడున్న వారంతా పరుగులు తీస్తూ బయటకు వచ్చేశారు. అక్కడ పని చేస్తున్న వారు అప్రమత్తం అయి బయటకు రావడంతో ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లలేదు. కాగా ఈ ప్రమాదంలో పరిశ్రమకు సంబంధించి పెద్ద ఎత్తున నష్టం జరిగినట్లు తెలుస్తోంది. నష్టం అంచనా ఇంకా వేయాల్సి ఉందని పరిశ్రమ ముఖ్య ఉద్యోగులు తెలియజేశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందడంతో వారు అక్కడికి వెళ్లి మంటలను ఆర్పారు. ప్రమాద విషయం తెలుసుకున్న సోమందేపల్లి ఎస్ఐ విజయ్ కుమార్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలన చేపట్టారు.

పరిశ్రమలో వ్యాపించిన మంటలు

## బంపర్ మెజార్టీతో గెలవబోతున్నాం ..

### మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి

**ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్**

పుట్టపర్తి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ గెలుపు తథ్యమని మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి జోస్యం చెప్పారు. ఈ మేరకు ఆయన బుధవారం పార్టీ స్థానిక కార్యాలయంలో ఆరు మండలాలకు చెందిన తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలతో విడివిడిగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులతో పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పల్లె మాట్లాడుతూ ప్రజలను పెద్ద ఎత్తున సమీకరించి పోలింగ్ కేంద్రాలకు వచ్చేలా చర్యలు తీసుకున్న కూటమి నాయకులు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో ఏకపక్షంగా తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా ఓటింగ్ జరిగిందని పల్లె సింధూర రెడ్డి బంపర్ మెజారిటీ తో గెలవనుందని ధీమా వ్యక్తం చేశారు. వృద్ధులు, మహిళలు అత్యధిక సంఖ్యలో పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరడం, స్వచ్ఛందంగా ఓటర్లు ఇళ్ల నుంచి వచ్చి ఓట్లు వేయడం వంటివి గమనిస్తే ప్రభుత్వం మీద ఎంత వ్యతిరేకత ఉందో అర్థమవుతోందని అన్నారు. పుట్టపర్తిలో తెలుగుదేశం పార్టీ భారీ మెజారిటీతో గెలవబోతుందని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కచ్చితంగా ఏర్పాటవుతుందని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, బూత్ ఏజెంట్లు, తదితరులు పాల్గొన్నారు.



పోలీసుల పహారా నేపథ్యంలో తాడిపత్రిలో నిర్మానుష్యంగా ఉన్న జెసి.ప్రభాకర్‌రెడ్డి, కేతిరెడ్డి నివాసాలు

# నివురుగప్పిన నిప్పులా తాడిపత్రి

◆ పోలీసుల అదుపులో వైసిపి, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థులు, ముఖ్య నేతలు

◆ వారి నివాసాల వద్ద భారీగా పోలీసు పహారా

◆ ఖాకీల వలయంలో తాడిపత్రి

◆ అత్యవసరాలు మినహా కొత్తవారికి అనుమతి నిరాకరణ

◆ ఇంకా భయం నీడనే తాడిపత్రి ప్రజలు

**ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్**

అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గ కేంద్రంలో ఎన్నికల పోలింగ్ రోజున మొదలైన గొడవ ఇంకా సర్దుమనగలేదు. నివురుగప్పిన నిప్పులా ఎప్పుడే ఏ ప్రమాదం జరుగుతుందో అన్న ఆందోళన ప్రజలను వెంటాడుతోంది. పోలింగ్ అనంతరం మంగళవారం నాడు కొనసాగిన పరస్పర దాడుల్లో టిడిపి, వైసిపి నాయకులు గాయపడ్డారు. వీటిని నిలువరించేందుకు వెళ్లిన పోలీసు, మిలటరీ సిబ్బంది కూడా గాయాలపాలయ్యారు. బుధవారం నాడు కూడా టిడిపి, వైసిపి గ్రూపుల మధ్య ఘర్షణ జరిగే అవకాశం ఉందన్న సమాచారం నేపథ్యంలో తాడిపత్రిలో మంగళవారం అర్ధరాత్రి నుంచే పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. డిఐజి, ఎస్పీ పక్క జిల్లాల పోలీసు ఉన్నతాధికారులు కేంద్ర, రాష్ట్ర, జిల్లాల బలగాలను మోహరింపజేశారు. బుధవారం తెల్లవారుజామున 3గంటల నుంచి పక్కా ప్రణాళికతో తాడిపత్రి పట్టణాన్ని వారి ఆధీనంలోకి తెచ్చుకున్నారు. ఎమ్మెల్యే, వైసిపి అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జెసి.ప్రభాకర్‌రెడ్డి కార్యాలయాల వద్ద పోలీసు బలగాలను మోహరింపజేశారు. వారివారి కార్యాలయాల్లో ఉన్న వారందరినీ అక్కడి నుంచి ఖాళీ చేయించారు. పలువురిని అదుపులోకి తీసుకుని దాడులకు సంబంధించి విచారణ సైతం చేస్తున్నారు.

**తాడిపత్రి చుట్టూ చెక్‌పోస్టులు..**

**కొత్తవారికి అనుమతి నిరాకరణ**

తాడిపత్రి పట్టణంలో ప్రస్తుతం నెలకొన్న శాంతిభద్రతల దష్ట్యా పోలీసులు కఠిన చర్యలకు ఉపక్రమించారు. అందులో భాగంగా పట్టణంలోకి కొత్తవారు ఎవరూ ప్రవేశించకుండా నలువైపులా చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. కొత్తవారు ఎవరినీ లోపలికి అనుమతించకుండా కట్టడి చేశారు. తాడిపత్రిలో వైద్యం, ఇతర అత్యవసరాలకు వెళ్లే వారికి మాత్రమే అనుమతిస్తూ చర్యలు తీసుకున్నారు. పోలీసుల ఆంక్షల నేపథ్యంలో పట్టణంలో పనిచేసే కూలీలు, కార్మికులు కాస్త ఇబ్బందులకు గురయ్యారు. వారివారి వ్యాపారాలను వదిలేసుకుని వెనక్కు వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రజలు కూడా నిత్యావసరాలు అందక ఇబ్బంది పడ్డారు.

**నిర్మానుషంగా తాడిపత్రి రోడ్లు**

శాంతి భద్రతల దృష్ట్యా పోలీసులు చేపట్టిన చర్యలతో పట్టణంలో ప్రధాన రోడ్లు నిర్మానుషంగా మారాయి. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జెసి.ప్రభాకర్‌రెడ్డి ఇళ్ల వద్దకు ఎవరినీ అనుమతించకపోవడంతో అ ప్రాంతం నిర్మాణుష్యం అయ్యింది. మంగళవారం అర్ధరాత్రి నుంచే అక్కడున్న వారందరినీ చెదరగొట్టారు. ఎవరూ అక్కడ ఉండేందుకు వీల్లేదంటూ గట్టి హెచ్చరికలు చేశారు.

**పోలీసుల అదుపులో టిడిపి,వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థులు**

తాడిపత్రి పట్టణంలో నెలకొన్న యుద్ధ వాతావరణాన్ని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు కఠిన చర్యలకు ఉపక్రమించారు. ఇందులో భాగంగా టిడిపి, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థులు పెద్దారెడ్డి, అస్మిత్‌రెడ్డిలతో రెండు పార్టీల ప్రధాన నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ముఖ్య నాయకులు అందరిని కూడా పక్క జిల్లా పోలీసు స్టేషన్లకు తీసుకెళ్లి అక్కడి ఉంచినట్లు తెలుస్తోంది. మండల, పట్టణ ముఖ్య నాయకులను సైతం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముఖ్య నాయకులందరినీ పోలీసులు వారి అదుపులో ఉంచుకోవడంతో బుధవారం మధ్యాహ్నం సమయానికి తాడిపత్రి పట్టణంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు అదుపులోకి వచ్చాయి.

**పోలీసులపై ఈసీకి ఫిర్యాదు చేస్తాం**

**ఎమ్మెల్యే, వైసిపి అభ్యర్థి పెద్దారెడ్డి**

'తమ కార్యాలయం వద్ద పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి డోర్లు బద్దలు కొట్టారు. కంప్యూటర్లు హార్డ్ డిస్కులు ధ్వంసం చేశారు. పోలీసుల చర్యలపై తాను ఈసీకి ఫిర్యాదు చేస్తా' అని ఎమ్మెల్యే, వైసిపి అభ్యర్థి పెద్దారెడ్డి బుధవారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. జిల్లా ఏఎస్పీ రామకృష్ణ టిడిపికి తొత్తుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఆయన అండతోనే జెసి.ప్రభాకర్ రెడ్డి రెచ్చిపోయి తాడిపత్రిలో గొడవలు సష్టిస్తున్నారని తెలిపారు. ఏఎస్పీపై కూడా ఈసీకి ఫిర్యాదు చేసి సస్పెండ్ చేయమని కోరుతామన్నారు.

**జెసి.ప్రభాకర్‌రెడ్డికి అస్వస్థత**

తాడిపత్రిలో మంగళవారం నాడు టిడిపి, వైసిపి గ్రూపుల మధ్య జరిగిన దాడుల నేపథ్యంలో శాంతి భద్రతలను అదుపు చేసేందుకు పోలీసులు బాష్పవాయువును ప్రయోగించారు. ఈ సమయంలో దట్టమైన పొగ వ్యాపించగా దానిని పీల్చిన మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి అవస్థతకు గురయ్యారు. పొగ ఊపిరితిత్తుల్లో చేరుకుందని స్థానిక వైద్యులు చెప్పడంతో వెంటనే కుటుంబ సభ్యులు ఆయన్ను చికిత్స నిమిత్తం హైదరాబాదులోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు.

హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న జెసి.ప్రభాకర్‌రెడ్డి

# 90 శాతం సబ్సిడీపై విత్తన వేరుశనగ ఇవ్వాలి

## 2023 ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ రైతుల ఖాతాల్లో జమ చేయాలి - జెడిఎకు ఎపి రైతుసంఘం వినతి

**ప్రజాశక్తి-అనంతపురం**

జిల్లాలోని రైతులకు ఖరీఫ్ సీజన్‌లో సాగుకు అవసరమైన విత్తన వేరుశనగ కాయలను 90 శాతం రాయితీపై సరఫరా చేయాలని, 2023 ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి(జెడిఎ) యు.ఉమా మహేశ్వరమ్మకు వినతిపత్రం సమర్పించారు. ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ 2023 ఖరీఫ్‌లో తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పాడ్డాయి. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వర్షాలు కురవక వేరుశనగ, కంది, పత్తి, ఆముదం, జొన్న, ప్రొద్దుతిరుగుడు, తదితర పంటలు దెబ్బతిన్నాయ న్నారు. దీంతో సరైన దిగుబడులు రాక, పెట్టిన పెట్టుబడులు కూడా గిట్టుబాటు కాక రైతులు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖరీఫ్‌లో 28 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించినా కరువు సహాయక చర్యలు చేపట్టలేదన్నారు. రబీలో కూడా పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. కావున ఇకనైనా ప్రత్యేక నిధులు కేటాయించి, కరువు నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్రంలోనే పెద్దఎత్తున వేరుశనగ పంట లక్షల ఎకరాల్లో సాగవుతున్నది ఒక్క అనంతపురం జిల్లాలో మాత్రమే అన్నారు. అయితే వర్షం మీద ఆధారపడి సాగు చేయడం వల్ల అనేక సంవత్సరాలు కరువు వచ్చి రైతులు అప్పుల్లో కూరుకుపోయార న్నారు. రైతాంగం విత్తనాలు, పెట్టుబడికి కూడా ఆర్థికస్థోమత లేని దుస్థితికి చేరుకుందన్నారు. ఇలాంటి స్థితిలో ఈ సంవత్సరం కూడా సబ్సిడీపై వేరుశనగ సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అయితే గతం నుంచి ఇస్తున్న 40 శాతం సబ్సిడీతో కాకుండా జిల్లాలో తీవ్రమైన కరువు దృష్ట్యా 90 శాతం సబ్సిడీతో ఇచ్చి, కరువులో వున్న రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వం వెంటనే ప్రత్యేకంగా నిధులు కేటాయించి, కరువు నివారణ చర్యలు చేపట్టాల న్నారు. జిల్లాలో వరుస కరువుల దృష్ట్యా విత్తన వేరుశనగ కాయలు 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2023 ఖరీఫ్, రబీ, ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ ప్రకటించి రైతుల ఖాతాలకు జమ చేయాలని కోరారు. వేరుశనగలో అంతర పంటలైన కందులు, పెసలు, అలసందలు, ఆముదం, జొన్న, సజ్జ, ప్రొద్దుతిరుగుడు, కొర్ర, తదితర విత్తనాలు ఉచితంగా సరఫరా చేయాలని కోరారు. వేరుశనగ పంటకు జిల్లాలో దిగుబడి ఆధారిత బీమా అమలు చేసి, ప్రభుత్వ రంగంలోని ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే ఖరీఫ్ సాగుకు రైతులకు అందించాల్సిన సహకారం అందించాలని, లేనిచో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.



జెడిఎ యు.ఉమామహేశ్వరమ్మకు వినతిపత్రం ఇస్తున్న ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి

తోపుడుబండి వ్యాపారికి గొడుగు పంపిణీ చేసిన ప్రగతి పథం యూత్ అసోసియేషన్ సభ్యులు

## చిరు వ్యాపారులకు గొడుగులు వితరణ

**ప్రజాశక్తి-అనంతపురం**

ప్రగతి పథం యూత్ అసోసియేషన్, అభయ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం అనంతపురం నగరంలోని చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేశారు. పంపిణీ కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత బిసాటి భరత్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత బిసాటి జీవన్‌కుమార్, యూత్ ఐకాన్ రాజశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు. భరత్ మాట్లాడుతూ నగరంలో చాలా మంది చిరు వ్యాపా రులు ఎండను సైతం లెక్కచేయకుండా వ్యాపారం చేసుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. అలాంటి వారికి బాసటగా అభయ ఫౌండేషన్ సహకారంతో గొడుగులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ప్రగతి పథం యూత్ అసోసియేషన్ సభ్యులు వై.పవన్, ఎం.కిరణ్‌సాయి పాల్గొన్నారు.

ఓబులేసుస్వామి ఆలయంలో తితిదే సభ్యులు

## ఓబులేసుస్వామి ఆలయానికి తితిదే ఆర్థికసాయం

**ప్రజాశక్తి-నార్పల**

మండలంలోని దుర్గం గ్రామంలో వెలసిన ఓబులేసుస్వామికి ఆలయానికి తిరుమల తిరుపతి దేవస్థానం(టిటిడి) వారు ఆర్థికసాయం అందజేశారు. తితిదే హిందూ ధర్మప్రచార పరిషత్ పర్యవేక్షణ అధికారులు మోహనయ్య, పండిట్ వేణు బుధవారం దుర్గం గ్రామంలోని ఓబులేసు స్వామి ఆలయాన్ని సందర్శించారు. ధూప దీప నైవేద్యాల కోసం రూ. 5వేలను అర్చకులు మారుతికి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ నరసింహులు, వైస్ ఛైర్మన్ పెద్దన్న, సభ్యులు కుల్లాయ ప్ప, పక్కీరప్ప, మారెప్ప, తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**గోరంట్ల :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గిరిజన బాలికల పాఠశాలలో నాలుగో తరగతి నుండి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవచ్చని కళాశాల ప్రిన్సిపల్ విజయ్ కుమార్ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడో తరగతికి 40 సీట్లు, నాలుగో తరగతికి 36 సీట్లు, ఐదో తరగతికి 29, ఆరో తరగతికి 7, ఏడో తరగతికి 5, ఎనిమిదో తరగతికి 1, 9వ తరగతికి 8 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు.

## టెక్నికల్ కోర్స్ సర్టిఫికెట్లు పొందండి

**కొత్తచెరువు రూరల్ :** టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు లోయర్, హయర్ పరీక్షలకు హాజరై ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు శ్రీ సత్య సాయి డిఇఒ మీనాక్షి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023 జూలై నెలలో పాసైన విద్యార్థుల సర్టిఫికెట్లు జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో అందుబాటులో ఉంచామని, టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు లోయర్, హయర్ కోర్సు, డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడింగ్ లోయర్, హాయర్ పాసైన విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఒరిజినల్ మార్క్ మెమో ఇవ్వనున్నట్లు తెలిపారు. పాసైన విద్యార్థులు తమ మార్కుల మెమో పొందడానికి ఆధార్ కార్డు, హాల్ టికెట్ నకలు కాఫీ తీసుకొని రావాలని డిఇఒ కోరారు.

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION)
::GOOTY
S.O.P.No.12/2024
BETWEEN:
MOHAMMAD RAFI ...PETITIONER
AND
NIL. ...RESPONDENTS

ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా పై అర్జీదారుడు తన తండ్రి అయిన మహబూబ్ దౌల చనిపోయినందున తన తండ్రికి M/S రిలయన్స్ సెక్యూరిటీ ముంబాయి కంపెనీ వారి నుండి రావలసిన రూ. 2,92,827/-(అరాల రెండు లక్షల తొంభైరెండు వేల ఎనిమిది వందల ఇరవై ఏడు రూపాయిలు) లకు ఆయన వారసుడనియు మరియు అతని తల్లి రహింబీ, అతని అన్న మస్తాన్‌వలీ మరియు అతని సోదరి యం.హసినా మరియు సాఫియాబాను నుండి తన తండ్రికి సంబంధించిన రిలయన్స్ సెక్యూరిటీ మొత్తము రూ. 2,92,827/-తనకు చెల్లించుటకు వారికి అభ్యంతరము లేదని వారి అఫిడవిట్లను కోర్టులో దాఖలు చేసి తనకు కోర్టు నుండి SUCCESSION CERTIFICATE మంజూరు చేయవలయనని పై కోర్టులో అర్జీని దాఖలు చేసినారు.సదరు కోర్టు వారు S.O.P. No.12/2024 ను 20/06/2024వ తేదికి వాయిదా వేసినారు. కావున ఎవరికైన సదరు అర్జీ పై ఆక్షేపణలున్న యెడల పై కోర్టులో 20/06/2024వ తేదిన పగలు 10:30 గం॥లకు హాజరై ఆక్షేపణలున్న యెడల తెలుపుకొనవలెను.

R.V.CHALAPATHI,
MD.BABA TAZUDDAIN,
ADVOCATES FOR PETITIONER

**ఇంటి డాక్యుమెంట్ పోయినది**

గుత్తి పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన **కె.శివరామిరెడ్డి కుమారుడైన కె.వెంకటేశ్వర రెడ్డికి** సంబంధించిన ఇంటి లింకు (1757/2009) ఒరిజినల్ డాక్యుమెంట్ తీసుకొని జిరాక్స్ చేయించడానికి తీసుకెళ్తుండగా పోయినది. దొరకిన వారు వెంటనే 9908052882 నెంబర్‌కు ఫోన్ చేయగలరు.

# రైతులకు నాణ్యమైన నారు విక్రయించాలి

### నర్సరీల రిజిస్ట్రేషన్, రెన్యువల్‌కు దరఖాస్తులు ఆహ్వానం : కళ్యాణదుర్గం డివిజన్ ఉద్యాన అధికారి ఎం.కృష్ణ తేజ

**ప్రజాశక్తి-బెళుగుప్ప**

రైతులకు నాణ్యమైన కూరగాయల నారును విక్రయించాలని కళ్యాణదుర్గం డివిజన్ ఉద్యాన అధికారి ఎం.కృష్ణతేజ నర్సరీ యాజమాన్యానికి సూచించారు. ఆయన బుధవారం కళ్యాణదుర్గం డివిజన్‌లో ఉన్న షెడ్ నెట్టు నర్సరీల ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నర్సరీ చట్టం-2010 ప్రకారం నర్సరీ లైసెన్స్, రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని నర్సరీ నిర్వాహకులకు సూచించా రు. నర్సరీ యజమానులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు విత్తనాల ప్యాకెట్ మీద విత్తన రకం, లాట్ నెంబరు, కంపెనీ విత్తన లేబుల్‌ని చూసి నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. విత్తనాలు కొన్న ఒరిజినల్ రసీదును జాగ్రత్తగా భద్రపరచుకుని నర్సరీ రిజిస్టర్‌లో నమోదు చేసుకో వాల

నర్సరీ నిర్వాహకులకు సూచనలు చేస్తున్న ఉద్యాన అధికారి కృష్ణతేజ

న్నారు. నర్సరీ రిజిస్టర్, నారు ధరల పట్టికను నిత్యం నర్సరీ బయట ప్రదర్శించాలన్నారు. బిల్ బుక్కులు, నారు కొనుగోలు చేసిన రైతులకు కచ్చితంగా కొనుగోలు రసీదు ఇవ్వాలని సూచించారు. ఎవరైనా నాసిరకం కూరగాయల నారు విక్రయించినా, అధిక ధరకు అమ్మినా ఆ నర్సరీ యాజమాన్యం పై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొత్తగా షెడ్ నెట్ నర్సరీలు ఏర్పాటు చేసుకునే వారు రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని, రెన్యువల్ చేసుకోవాల్సిన నర్సరీలు ఏమైనా ఉన్నా వాటి యజమానులు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ఇకపై లైసెన్స్ లేకుండా కూరగాయల నారును విక్రయించే నర్సరీల యాజమాన్యంపై శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట కళ్యాణదుర్గం డివిజన్ ఉద్యాన శాఖ అధికారులు, ఆర్‌బికె సిబ్బంది, రైతులు, పాల్గొన్నారు

## వినియోగదారులకు వంట గ్యాస్ కష్టాలు?

### డోర్ డెలివరీకి అదనంగా చెల్లించాల్సిందే.. బుక్ చేసిన15 రోజులకూ అందని సిలిండర్

**ప్రజాశక్తి-బొమ్మనహాల్**

వంట గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు నిబంధనలు పాటించకపోవడంతో మండల వ్యాప్తం గా వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. మండలంలోని 30 గ్రామాలకు గ్యాస్ సిలిం డర్ డోర్ డెలివరీ ఇవ్వాలని నిబంధన ఉన్నా కర్నా టక సరిహద్దులోని ప్రాంతాల్లో సిలిండర్‌ను డోర్ డెలివరీ చేయడం లేదు. దీంతో కొందరు వినియోగ దారులు ప్రధాన రహదారి నుంచి ఇంటికి సొంత వాహనాల్లో తీసుకెళ్తున్నారు. వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, చేతకాని వారు విధిలేని పరిస్థితుల్లో గ్యాస్ డెలివరీ బాయ్‌కి అదనంగా రూ. 50 చెల్లించి ఇంటి వద్దకు తెప్పించుకుంటున్నారు. ప్రతి సిలిండర్‌పై ఎంఆర్‌పి కాకుండా అదనంగా రూ. 50 వసూలు చేస్తున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై వినియోగదారు లు ప్రశ్నిస్తే మీ గ్యాస్ ఆన్‌లైన్‌లో బుక్ కాలేదు సిలిం డర్ మరో వారం ఇస్తామంటూ ఏదో ఒకటి సాకులు చెబుతున్నారని ప్రజలు వాపోతున్నారు. దీనికి తోడు వంట గ్యాస్ లీకైన సమయంలో ఫోన్ చేస్తే స్పందించడం లేదని, ఏజెన్సీ నిర్వాహకుల నిర్లక్ష్యం వల్ల ఇప్పటికే మండలంలో రెండు ప్రమాదాలు చోటుచేసుకున్నాయన్నారు. ఉంతకల్లు, దర్గాహొ న్నూరు గ్రామాల్లో సిలిండర్ పేలి ప్రమాదాలు జరిగినా వాటిపై అధికారులు స్పందించకపోవ డంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతు న్నాయి. ఫోన్ ద్వారా గ్యాస్ బుక్ చేసిన తర్వాత 15 రోజులైనా గ్యాస్ అందడం లేదని, కానీ గ్యాస్ అందినట్లు మెసేజ్ వస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ విషయాలపై పౌర సరఫరాల శాఖ ఇన్‌ఛార్జి డిప్యూటీ తహశీల్దార్ సుజాతను వివరణ కోరగా విచారణ చేస్తామని దాటవేత ధోరణిలో సమాధానం ఇచ్చారు.

## 144 సెక్షన్ కొనసాగింపు

### శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి

**ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్**

శ్రీ సత్య సాయి జిల్లాలో 144 సెక్షన్ కొనసాగిస్తున్నట్లు శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ ఎస్‌వి. మాధవ్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బుధవారం నుండి కౌంటింగ్ పూర్తి అయ్యేవరకు అంటే జూన్ 5వ తేదీ వరకు ఈ 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. జిల్లాలో ఎవరైనా హింసాత్మకమైన ఘటనలకు పాల్పడినా, విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యవహరించినా, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చ రించారు. ఎక్కడ గుంపులు గుంపులుగా ఉండకూ డదని, అనుమతులు లేకుండా ఎక్కడ సభలు, సమా వేశాలు, ప్రచారాలు నిర్వహించకూడద అన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికలు ప్రశాంతం గా ముగిశాయని అందరూ సమయస్ఫూర్తితో ఉండాలని, ఎక్కడ ఎటువంటి అల్లర్లు గొడవలకు వెళ్లకూడదని ఎస్పీ సూచించారు. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు, పెళ్లిళ్లు, అంత్యక్రియలకు మినహాయింపు ఇచ్చామన్నారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు 144 సెక్షన్ జిల్లాలో అమలవుతుం దన్నారు. జిల్లా ప్రజలు, అన్ని రాజకీయ పార్టీ నాయకులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకోవా లన్నారు. ఇవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట మైన భద్రత ఏర్పాట్లు చేశామని చెప్పారు. జిల్లాలోని పోలీసులు అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపడుతూ సిబ్బందిని నిరంతరం అప్రమత్తం చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రజలు ఎటువంటి గొడవలకు వెళ్లకుండా గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించే విధంగా పోలీస్ యంత్రాంగం నిరంతరం పనిచేస్తుంద న్నారు. ప్రజలు రాజకీయ పార్టీలకు ఎక్కడైనా ఇబ్బం దులు కలిగిన తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా పోలీసులు అందరూ అందుబాటులో ఉంటారని జిల్లా ఎస్పీ తెలిపారు.

## కల్తీ ఆహారం విక్రయిస్తే కఠిన చర్యలు

### రెస్టారెంట్లకు అనుమతి తప్పనిసరి : ఆహార భద్రత అధికారిణి తస్లీం

**ప్రజాశక్తి-హిందూపురం**

ప్రజారోగ్యమే తమ ప్రథమ కర్తవ్యమని, కల్తీ ఆహారం ఎవరు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆహార భద్రత అధికారిణి తస్లీం హెచ్చరించారు. పట్టణంలోని సరిగమ ఫ్యామిలీ రెస్టారెంట్, తాడిపత్రి బిర్యాని హౌస్ రెస్టారెంట్‌లను జిల్లా ఆహార భద్రత అధికారిణి తస్లీం బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా రెస్టారెంట్లలో వండిన ఆహార పదార్థాలను, వండడా నికి సిద్ధం చేసిన పదార్థాలను పరిశీలించారు. అందు లో అనుమానిత ఆహార పదార్థాల నమూనాలను పరిశీలన నిమిత్తం సేకరించారు. రెండు రెస్టారెం ట్లకు నోటీసులను జారీ చేశారు. ఆమె మాట్లాడుతు జిల్లా వ్యాప్తంగా ఈ మధ్య కాలంలో విపరీతంగా రెస్టారెంట్లు వెలిశాయ, దీంతో విస్తృతంగా తనఖీలు చేస్తున్నామన్నారు. నిర్వాహకులు ఆహార భద్రత శాఖ అనుమతులు తీసుకోవాలన్నారు. లేనిచో చర్యలు తీసుకుంటామని హెచ్చరించా రు. ఆహార పదార్థాలు విక్రయించే హోటళ్లు, రెస్టారెంట్లు, పలు దుకాణా దారులు అందించే ఆహార పదార్థాల్లో నాణ్యత ప్రమాణాలు తప్పని సరిగా పాటించాలన్నారు. కాలం చెల్లిన ఆహార పదార్థాలను విక్రయిస్తే ఆహార భద్రత ప్రమాణాల చట్టం కింద వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై 2006 ఆహార భద్రత చట్టాన్ని అనుసరించి కేసు నమోదు చేస్తామన్నారు. ఆహార పదార్థాలను కల్తీ చేయడం, ప్యాకింగ్ రీమేక్ చేసి విక్రయించడం చేస్తే వారు ఎంతటి వారైనా చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మీడియాతో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కె.సుధాకర్

## 'రఘువీరాను విమర్శించే అర్హత ఎంఎస్ రాజుకు లేదు'

### కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కె.సుధాకర్

**ప్రజాశక్తి - మడకశిర**

సిడబ్ల్యూసి మెంబర్, మాజీ మంత్రి రఘువీరారెడ్డిని విమర్శించే అర్హత టిడిపి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెస్ రాజుకు లేదని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సుధాకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత రఘువీరారెడ్డికి దక్కుతుందన్నారు. ఎన్నో ఏళ్ల నుండి పరిష్కారానికి నోచుకుని ఎన్నో కార్యక్రమాలను ఆయన పూర్తి చేశారన్నారు. హంద్రీనీవా కాలువ ద్వారా ఇప్పటికే చాలా గ్రామాలలో నీరు చేరిందంటే అది ఆయన చేసిన కృషే నని అన్నారు. అదేవిధంగా శ్రీరామ్ రెడ్డి మద్దిలేటి పథకం ద్వారా ఎన్నో గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, రైల్వే లైనుకు కృషి చేశారని చెప్పారు. నియోజకవర్గంలో ఎంతోమంది పేద విద్యార్థుల కోసం కళాశాల ఏర్పాటు చేసిన ఘనత రఘువీరారెడ్డికి దక్కుతుందన్నారు. ఎన్నికల్లో ఏ బూత్‌లోనూ ఓట్లు పడలేదో అంతర్గత సమావేశాల్లో చర్చించాలేగాని లేనిపోని ఆరోపణలు రఘువీరారెడ్డి పై చేయడం తగదని అన్నారు. నియోజకవర్గంలో ప్రజల గుండెల్లో ఆయన ఎప్పటికీ చిరస్థాయిగా నిలబడతారని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మందలపల్లి నాగరాజు, మంజునాథ్, గౌడప్ప, లోకేష్, గురుమూర్తి, బాబుతో పాటు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ

## 'పెనుకొండలో గెలవబోతున్నాం'

### టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ

**ప్రజాశక్తి - గోరంట్ల**

పెనుగొండ నియోజకవర్గంలో టిడిపి అత్యధిక మెజార్టీతో గెలవబోతోందని ఆపార్టీ పెనుగొండ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలో టిడిపి కార్యాలయంలో కార్యకర్తలు నాయకులతో సమావేశం నిర్వహించారు. సవితమ్మ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు అత్యధిక సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. ఈ ఎన్నికల్లో టిడిపి కార్యకర్తలు నాయకులు బాగా పనిచేశారని వారికి ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. పార్టీ కోసం పనిచేసిన వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణ చౌదరి, నరేష్, మరి రెడ్డి పల్లి నరసింహులు, జీనవాండ్లపల్లి లక్ష్మీనరసప్ప, ఉత్తమ్ రెడ్డి, చంద్ర పాల్గొన్నారు.

**పరిగి :** పెనుకొండ నుంచే వైసీపీ అంతం ప్రారంభమవుతుందని పెనుగొండ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ వ్యాక్యానించారు. బుధవారం పరిగి మండల కేంద్రంలోని బీర లింగేశ్వర స్వామి కళ్యాణ మండపంలో మండల వ్యాప్తంగా నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో టిడిపి ఉన్నతకి పనిచేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. అనంతరం పంచాయతీల వారీగా నాయకులు కార్యకర్తలతో ఎన్నికల రివ్యూ నిర్వహించారు ఈ కార్యక్రమంలో టిడిపి ఐటి విభాగం ప్రతినిధి మంజునాథ్, మారుతి, మండల నాయకులు బాలాజీ, సత్యనారాయణ, శ్రీనివాసరెడ్డి, శేఖర్, ఈశ్వరప్ప, నాగభూషణం, చౌడప్ప, హనుమయ్య, వడ్డెర శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# అడ్డంగా ఆక్రమించుకున్నారు.!

### మార్కెట్ వ్యాపారులకు అధికారులు దాసోహం
### నెలకు రూ. లక్షల్లో మున్సిపల్ ఆదాయానికి గండి
### 'పురం'లో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

**పురపాలక సంఘంలో సొంత స్థలంలో మున్సిపల్ శాఖ అనుమతి లేకుండా చిన్నపాటి ఇల్లు కడుతుంటే వెంటనే సిబ్బంది అక్కడికి చేరుకుని పనులను అడ్డుకోవడంతో పాటు వారికి నోటీసులు ఇస్తారు. అలాంటిది హిందూపురం పురపాలక సంఘ ఆధీనంలో ఉన్న ప్రయివేటు బస్టాండ్‌ను కూరగాయల టోకు వ్యాపారులు అడ్డంగా ఆక్రమించుకుని, ఎటువంటి అనుమతులు లేకుండా షెడ్ల నిర్మాణాలు చేసుకున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు అందినంత మామూళ్లు దోచుకుని వారికి ప్రత్యక్షంగా సహకరిస్తు కూరగాయల వ్యాపారులకు దాసోహం అయ్యారు. దీంతో పురపాలక సంఘం నెలకు లక్షల రూపాయల్లో ఆదాయం కోల్పోతోంది. దీంతో పాటు బస్టాండ్ ఆవరణం తక్కువ కావడంతో ప్రయాణికులతో పాటు వాహనదారులు సైతం ఇబ్బంది పడుతున్నారు.**

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురం పురపాలక సంఘ ఆదాయానికి గండి పడిన పర్వాలేదు తమకు ఆదాయం వస్తే చాలు అన్నట్లు పురపాలక సంఘ అధికారులు వ్యవహరిస్తున్నారు. దీనికి ప్రత్యక్ష సాక్ష్యం పట్టణంలోని పరిగి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కూరగాయాల టోకు మార్కెట్. హిందూపురం పురపాలక సంఘంలో నూతనంగా నిర్మాణం చేసిన వాణిజ్య సముదాయ భవనం, కూరగాయాల మార్కెట్‌లో భారీగా అవినీతి జరిగిన ట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఇది చాలదన్నట్లు పరిగి బస్టాండ్ ఆవరణంలో ఎటువంటి అనుమతులు లేకున్నా టోకు వ్యాపారులకు స్థలాన్ని కేటాయించడంతో పాటు పురపా లక సంఘం తరపున అక్కడ రోడ్లు సైతం వేయించారు. వాస్తవానికి నూతన మార్కెట్ నిర్మాణ సమయంలోనే టోకు వ్యాపారులకు స్థలాన్ని కేటాయించాల్సి ఉంది. అయితే ఆ సమయంలో మున్సిపల్ అధికారులు ఆలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో టోకు వ్యాపారులు పట్టణంలోని పశు సంవర్ధక శాఖ ఆధీనంలో ఉన్నా రైతు బజారులో టోకు వ్యాపారం నిర్వహించుకునే వారు. అయితే వ్యాపారులు అందరు తమకు స్థలాన్ని కేటాయించాలని మున్సిపల్ అధికారులతో పాటు అధికార పార్టీ నేతలను కోరారు. దీంతో గత సంవత్సరం మే నెలలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ సూచనల మేరకు పట్టణంలోని టిఎస్ నెంబరు 68 పరిగి బస్టాండ్‌లో 15 - 20అడుగుల విస్తీర్ణం స్థలాన్ని 18 మందికి కేటాయిస్తు 2023 మే 31న జరిగిన కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేశారు. దీంతో పాటు తీర్మానం నెంబరు 970 అనుసరించి కేటాయిస్తున్న స్థలాన్ని మూడు సంవత్సరాల కాల పరిమితితో బహిరంగ వేలం పద్దతిలో టోకు వ్యాపారులకు కేటాయించాలని కౌన్సిల్ తీర్మానం చేశారు. అయితే నాడు పాలక వర్గం తీర్మానం చేసిన తీర్మానానికి తిలోదాకాలు పలికి టోకు వ్యాపారులు వారికి ఇష్టం వచ్చినట్లు స్థలాన్ని కేటాయించుకుని షెడ్ల నిర్మాణాలు చేసుకున్నారు. అయినప్పటికి మున్సిపల్ అధికారులు మాత్రం తమకు ఏమి తెలియదన్నట్లు వ్యవహరిస్తున్నారు. పురపాలక సంఘంలో అనుమతులు లేకుండా చిన్న గది నిర్మాణం చేసుకున్న నోటీసులు ఇచ్చే మున్సిపల్ యంత్రాంగం కోట్ల రూపాయల విలువ చేసే పురపాలక స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా షెడ్ల నిర్మాణాలను చేసుకుని దర్జాగా వ్యాపారాలు చేస్తున్నప్పటికి వారిపై కనీస చర్యలు కాదు కదా నోటీసు

పురం టోకు మార్కెట్‌లో లావాదేవీలు జరుగుతున్న దృశ్యం

సైతం ఇవ్వలేక పోయింది. దీనికి ప్రధాన కారణం టోకు వ్యాపారుల నుంచి పెద్ద ఎత్తున మామూళ్లు తీసుకోవడంతో పాటు అధికార పార్టీ నేతల అండదండలు వ్యాపారులకు పుష్కలంగా ఉన్నాయన్న ఆరోపణలు వినపడుతున్నాయి. దీని మూలంగానే మార్కెట్ షెడ్లు నిర్మాణంపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ అధికారులు పక్కగా నిబంధనలు పాటించి, కౌన్సిల్ ఆమోదం మేరకు స్థలాన్ని బహిరంగ వేలం పద్ధతిలో కేటాయింపులు జరిపితే నెలకు కనీసం ఒక షాపునకు రూ.6వేలు అద్దె నిర్ణయించినా నెలకు దాదాపు రూ.లక్ష నుంచి రూ.1.30 లక్షల వరకు ఆదాయం వచ్చేది. ఇప్పటికి ఒక సంవత్సరం అయింది. ఈ సంవత్సర కాలనికి దాదాపు రూ.13లక్షల వరకు పురపాలక సంఘం ఆదాయం కోల్పోయింది. ఇప్పటికైన దీనిపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి పురపాలక సంఘ ఆస్తులను పరిరక్షించడంతో పాటు బహిరంగ వేలం పద్దతిలో స్థలాలను కేటాయించే విధంగా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## నేరాలు ఘోరాలు

### ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ఆత్మహత్యకు పాల్పడిన అలిబాషా

**ప్రజాశక్తి-పామిడి**

పట్టణంలోని తలవాలకట్ట వీధికి చెందిన అలీబాషా బుధవారం ఉరి వేసుకుని మృతి చెందాడు. తెల్లవారుజామున ఇంట్లో ఎవరూ లేని సమయంలో కె.ఆలీబాషా(28) ఇంటి పైకప్పునకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువులు తెలిపిన వివరాలు.. ఆర్థిక ఇబ్బందుల వల్ల మంగళవారం రాత్రి భార్యతో గొడవపడ్డాడు. దీంతో మనస్థాపం చెంది ఉరి వేసుకొన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి తరలించారు. అలాగే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

### వ్యక్తి అనుమానాస్పద మృతి

**ప్రజాశక్తి-గుంతకల్లు**

పట్టణ శివారులోని బళ్లారి రహదారి సమీప పొలాల్లో బోయ ప్రసాద్(40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు బుధవారం వన్‌టౌన్ పట్టణ పోలీసులు తెలిపారు. స్థానిక పాత గుంతకల్లులోని అంకాలమ్మ వీధిలో నివాసం ఉంటున్న బోయ ప్రసాద్ బళ్లారి రహదారి సమీప పొలాల్లో శవమై పడి ఉండడంతో స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వగా పోలీసులు సంఘటనా స్థలనాకి చేరుకుని పరిశీలించారు. మృతుడి మెడపై తాడుతో బిగించిన ఆనవాళు ఉండడంతో పోలీసులు హత్యగా ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### గుంతకల్లు బీరప్పగుడిలో చోరీ

**ప్రజాశక్తి-గుంతకల్లు**

పట్టణంలోని బీరప్ప గుడిలో మంగళవారం దుండగులు చోరీకి పాల్పడి హుండీలోని రూ. 5 లక్షల నగదు ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. గుర్తు తెలియని దుండగులు గుణపాలతో ఆలయం గేట్‌ను పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. కానుకల రూపంలో ఏడాదిగా భక్తులు హుండీలో వేసిన రూ. 5 లక్షల నగదు దోచుకు వెళ్లినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బసప్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఆలయం వద్దకు చేరుకుని పరిశీలించారు. అలాగే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### విషపు పండ్లు తిని 12 గొర్రెలు మృత్యువాత

పొలంలోనే మృతిచెందిన గొర్రెలు

**ప్రజాశక్తి-నార్పల**

క్రిమిసంహారక మందు పిచికారి చేసిన దానిమ్మ పండ్లు తిని గొర్రెలు మృత్యువాత పడిన సంఘటన బుధవారం నార్పల శివారు పొలాల్లో చోటుచేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాలు.. పట్టణంలోని చైతన్య కాలనీకి చెందిన మరిమేకల ఆదెప్ప గొర్రెలు మేపుకొంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో బుధవారం పట్టణ శివారులో గొర్రెలను మేపేందుకు తీసుకెళ్లాడు. అక్కడికి సమీపంలోని ఓ తోటలో క్రిమిసంహార మందు పిచికారి చేసిన దానిమ్మ పండ్లు తిని 12 గొర్రెలు అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాయి. దీంతో రూ. 1.3లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

### టిడిపి కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం

**ప్రజాశక్తి-శింగనమల**

వెంకటలక్ష్మమ్మ మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న దండు శ్రీనివాసులు, టిడిపి నాయకులు

శింగనమలలో బుధవారం టిడిపి సీనియర్ కార్యకర్త గోరుమానుపల్లి నారాయణ(గడ్డం నారా యణ) తల్లి వెంకట లక్ష్మమ్మ అనారో గ్యంతో మృతి చెందింది. విష యం తెలుసుకున్న తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఆ గ్రామం వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిం చారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి టిడిపి అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో దాసరి గంగాధర్, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి ఆదినారాయణ, శింగనమల నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు బెస్త నారాయణ స్వామి, తెలుగు యువత శింగనమల మండల అధ్యక్షులు కాయల సురేష్ యాదవ్, శంకరనారాయణ, మాసూల ప్రకాష్, దండు ప్రకాష్, గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి మసూద్‌వలి, రంగస్వామి, ఆర్మీ జిలాన్, నరసింహ, శివ, రాజు, శివశంకర్, రుషేంద్ర, కాయల సుర్యనారాయణ, లాలు, తదితరులు పాల్గొన్నారు.

### హత్య కేసు నిందితులకు జీవిత ఖైదు

**ముదిగుబ్బ :** మండలంలోని బండ్లపల్లి గ్రామానికి చెందిన సాకే గంగరాజు హత్యకేసులో నిందితులకు జీవిత ఖైదు పడింది. వివాహేతర సంబంధం కారణంగానే ఈ హత్య జరిగింది. 02-03- 2016 వ తేదీన జరిగిన ఈ హత్యకు సంబందించి నిందితులైన గంగప్ప, ఆంజనేయులుపై అప్పట్లో ముదిగుబ్బ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదయింది. విచారణ అనంతరం కోర్టు బుధవారం తన తీర్పును వెలువరించింది. ఈ హత్యకేసులో నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ అనంతపురం నాల్గవ జిల్లా సెషన్స్ జడ్జి బుధవారం తీర్పును వెలువరించారు. ఈ హత్య కేసు దర్యాప్తు చేసి నిందితులకు శిక్ష పడే విధంగా చేసిన పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ అభినందించారు.

### అనారోగ్యంతో కళాకారుడు మృతి

**ప్రజాశక్తి-నార్పల**

బండారు నాగేష్ (ఫైల్‌ఫొటో)

నార్పలకు చెందిన కళాకారుడు బండారు నాగేష్ బుధవారం మృతి చెందారు. నాగేష్ మంచి డ్రామా కళాకారుడు. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్న అతడు అనంతపురం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆయన ఆంజనేయస్వామి వేషధారణలో మెప్పించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వం నుంచి పలు అవార్డులు పొందారు. అలాగే ఉమ్మడి అనంతపురం జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడిగా సేవలందించారు. ఆయన మృతి పట్ల తోటి కళాకారులు, స్నేహితులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## విద్యార్థులకు ఆర్డీటీ సెట్ హాల్ టికెట్లు పంపిణీ

**ప్రజాశక్తి-మడకశిర**

నియోజకవర్గ పరిధిలోని రొళ్ల మండల కేంద్రంలోని ఆర్డీటీ ప్రాంతీయ కార్యాలయంలో రొళ్ల, అగళి, మండలాలకు చెందిన పది పాసై ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు బుధవారం హాల్‌టికెట్లు పంపిణీ చేశారు. దరఖాస్తు చేసుకున్న 46 మంది విద్యార్థులకు ఎటిఎల్ ఓబులేసు హాల్‌టికెట్లు పంపిణీ చేశారు. వీరికి ఈ నెల 19న హిందూపూర్ బస్టాండ్ సమీపంలో గల ఎన్ఎస్ పీఆర్ మహిళ డిగ్రీ కళాశాలలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్ష లో మంచి ప్రతిభ కనపరిచే విద్యార్థులకు ఆరు సంవత్సరాల కాలం పాటు కార్పొరేట్ తరహాలో ఎంపిక చేసుకున్న పాఠశాలలో ఉన్నత విద్యకు అవకాశం కలిస్తున్నట్లు ఏటీఎల్ ఓబులేసు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది హనుమంతరాయుడు, శివప్రసాద్, వెంకటేశులు, విద్యార్థుల తల్లి తండ్రులు పాల్గొన్నారు.